నేడు కేంద్ర రక్షణశాఖ మంత్రి రాక

కీసర: మేడ్చల్ బీజేపీ అభ్యర్థి ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా రాంపల్లిలో నిర్వహించనున్న బహిరంగసభలో పాల్గొనేందుకు కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ శుక్రవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లికి విచ్చేయనున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి తెలిపారు. రాజ్‌నాథ్‌సింగ్ మధ్యాహ్నం 12 గంటలకు రాంపల్లికి చేరుకొని మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏనుగు సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా బహిరంగసభలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

డీసీసీ అధ్యక్షుడిగా హరివర్ధన్‌రెడ్డి



మేడ్చల్: మేడ్చల్ కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డ నియోజకవర్గ కాంగ్రెస్ నేత జెడ్పీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిని పీసీసీ మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా నియమించింది. కొన్ని రోజులుగా అసంతృప్తితో ఉన్న ఆయనను డీసీసీ అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్‌ఠాక్రే ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని అన్నారు.

అభినందనలు



ఘట్‌కేసర్: మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డికి కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు, ఘనాపూర్ సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సురేశ్‌నాయక్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌గౌడ్ అభినందనలు తెలిపారు. గురువారం బోయిన్‌పల్లిలోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. జీవితంలో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

సెయింట్ పీటర్స్‌లో క్లీన్ క్యాంపస్ డ్రైవ్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం క్లీన్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు క్యాంపస్ ఆవరణలోని పరిసరాలను శుభ్రం చేశారు. క్యాంపస్‌ను క్లీన్‌గా ఉంచడం విద్యార్థులు తమ బాధ్యతగా భావించాలని ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ టీవీ రెడ్డి, డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, ఎన్ఎస్ఎస్ పీఓ అసం రాజేశ్, ఏఓ హరిప్రసాద్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

వాలీబాల్ చాంపియన్‌గా వీబీఐటీ



వాలీబాల్ పోటీల్లో విజేతగా నిలిచిన వీబీఐటీ జట్టు

పోచారం: యంనంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు అశ్వత్థామ క్రీడా పోటీలు జరిగాయి. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు గురువారం బహుమతులు అందజేశారు. వాలీబాల్ చాంపియన్‌గా వీబీఐటీ నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ టామ్, స్టూడెంట్ కో ఆర్డినేటర్ జ్యోతి, వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

బీజేపీ సీనియర్ నేత కేశవరెడ్డి మృతి



మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ సీనియర్ నేత అత్వెల్లికి చెందిన నారెడ్డి కేశవరెడ్డి గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. అత్వెల్లిలో తన నివాసంలో ఆయనకు గుండెపోటురాగ కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. 40 ఏళ్లుగా బీజేపీలో ఉంటూ మేడ్చల్ రాజకీయాన్ని నడిపించారు. ఆయన గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఎదిగారు. ఆయన మృతి పట్ల బీజేపీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

డంప్ చేసిన మద్యం సీసాలు స్వాధీనం



తేజ వైన్స్‌పై కేసు రాస్తున్న ఎక్సైజ్ పోలీసులు

పోచారం: అనుమానాస్పద ప్రదేశాల్లో ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సీఆర్‌పీఎఫ్ నుంచి జవహర్‌నగర్ వెళ్లే దారిలో శివాలయం పక్కన అక్రమంగా డంప్ చేసిన 64 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో సిగ్నేచర్, అమెరికన్ ప్రైడ్, రిజర్వ్ విస్కీ బాటిళ్లు ఉన్నట్లు సీఐ మల్లయ్య తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐలు పురుషోత్తంరెడ్డి, శ్రావణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. లిక్కర్ అమ్మకాలకు బిల్స్ ఇవ్వనందుకు కాప్రాలోని తేజ వైన్స్‌పై కేసు రాసినట్లు చెప్పారు.

క్రీడల్లో రాక్‌వుడ్స్ విద్యార్థుల ప్రతిభ

ఉప్పల్: ఉప్పల్ విజయపురి కాలనీ రాక్‌వుడ్స్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి తాంగ్‌తా క్రీడల్లో విశేష ప్రతిభ కనబర్చారు. దీంతో పాటు పలువురు విద్యార్థుల జాతీయస్థాయికి ఎంపికయ్యారు. మహబూబాద్ జిల్లా ఎల్లికుదురు మండలంలో జరిగిన రాష్ట్రస్థాయి తాంగతా క్రీడల్లో స్వర్ణ, రజిత పతకాలను సాధించారు. రఫి, శశాంక్‌రెడ్డి, దినేష్ విద్యార్థులకు రజత పతకం, రిషిత్‌రెడ్డి కాంస్యం గెలుపొందడంతో పాటు తాంగ్‌తా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు రాక్‌వుడ్స్ విద్యాసంస్థల చైర్మన్ రామానాయుడు తెలిపారు. కార్యక్రమంలో సీఈవో సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ దీప తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్‌గ్యాలరీలో ఇండియన్ ఫొటో ఫెస్టివల్

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో గురువారం ఇండియన్ ఫొటో ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశారు.ఈ ప్రదర్శనను హెచ్‌ఎండీఏ కమిషనర్ అరవింద్‌కుమార్ ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో 40 దేశాల నుంచి 2500 మంది ఫొటోగ్రాఫర్‌లు పాల్గొన్నారు. జనవరి 7 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అభివృద్ధి చేశా.. మరోమారు అవకాశమివ్వండి..



మంత్రి మల్లారెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు



రోడ్ షోలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశా.. అందుకే మరోమారు అవకాశం ఇవ్వాలని ఓటు అడుగుతున్నానని మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని బొమ్మరాశిపేట, ఆద్రాస్‌పల్లి, కేశ్వాపూర్, ఉద్దమర్రి, లింగాపూర్‌తండా, పోతారం, నారాయణపూర్, అనంతారం తదితర గ్రామాల్లో మల్లారెడ్డి రోడ్ షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా తాను ఎన్నికైన తర్వాత ఏడాది పాటు స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలతో కాలం గడిచిపోయిందన్నారు.

- రెండేళ్ల పాటు కరోనా మహమ్మారి కారణంగా ఏ పనులు చేసే వీలులేకుండా పోయిందని అన్నారు. మిగిలిన రెండేళ్లలోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలిపానన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు తీర్చేందుకు ప్రతి గ్రామంలో, ప్రతి వాడలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులను చేపట్టానని, ఆలయాల వద్ద మౌలిక వసతుల కల్పనకు సొంత నిధులు ఖర్చు చేసినట్లు చెప్పారు.
- అభివృద్ధి చేసిన తనకే ఓటు అడిగే హక్కు ఉందని, అందుకే మరోమారు తనకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నానని, గెలిచిన తర్వాత నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుస్తానన్నారు. కోట్లాడి సాధించుకున్న తెలంగాణలో పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ అంటే కరువు, బీఆర్ఎస్ అంటే అభివృద్ధి అని మరోసారి తనకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు.

జోరుగా ఇంటింటి ప్రచారం..

మేడ్చల్ నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్లు, కార్పొరేటర్లు, మున్సిపాలిటీల్లో చైర్మన్లు, కౌన్సిలర్లు, గ్రామాల్లో సర్పంచులు, పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ ఎన్నికల మ్యానిఫెస్టోను, మల్లారెడ్డి చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. మరోసారి బీఆర్ఎస్‌కు మద్దతుగా ఓటు వేయాలని కోరారు.

బీఆర్ఎస్‌లో చేరికలు..

మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 23వ కౌన్సిలర్ కౌడే మహేష్, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో వార్డుకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు.



బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు



ఉద్దమర్రి గ్రామ రోడ్‌షోలో పాల్గొన్న మహిళలు, కార్యకర్తలు



గౌడవెల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

కాలుష్య కాసారాలు..

- మురుగునీరు, గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలతో చెరువులు



మియాపూర్: చెరువులు, కుంటలు కాలుష్య కాసారాలుగా మారాయి. చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా ఫలితం లేదు. నిండు కుండలా ఉండాల్సిన చెరువులు, కుంటలు గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు, మురుగు నీటితో నిండిపోయాయి. దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారయ్యాయి. మియాపూర్ డివిజన పరిధిలో చెరువుల సుందరీకరణకు లక్షలాది రూపాయలు కేటాయించినా కనీసం 25 శాతం పనులు కూడా పూర్తికాకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. హడావిడిగా శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించి తాత్కాలికంగా చెరువు కట్టలను పూడ్చి వదిలేశారు.

- డివిజన్ పరిధిలో నాయినమ్మకుంట, రామ సముద్రం కుంట, రేగులకుంట, పటేల్ చెరువు, మక్త చెరువు, బీకే ఎన్‌క్లేవ్ వద్ద మీదికుంట చెరువు అభివృద్ధి పనులు ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు పూర్తి కాలేదు.
- పటేల్ చెరువును రూ.12 కోట్లతో, రేగులకుంట చెరువు రూ.80 లక్షలు, నాయినమ్మ కుంట చెరువు రూ.1.25 కోట్లతో, మీదికుంట చెరువు, మక్త చెరువులకు రూ.2.13 కోట్లు, రామసముద్రం చెరువుకు రూ.కోటి రూపాయలు కేటాయించారు.
- పటేల్ చెరువుకు నిధులు కేటాయించి ఐదేళ్లు గడుస్తున్నాయి. ఐదేళ్ల క్రితం చెరువు సుందరీకరణ పనులను ప్రారంభించారు. ఇప్పటి వరకు చెరువుచుట్టు కట్ట మాత్రం ఏర్పాటు చేశారు. మురుగు మళ్లించేందుకు కొంత మేర పైపులైన్లు వేసి వదిలేశారు.
- మిగతా చెరువులకు చుట్టు మట్టి పోసి వదిలేశారు. చెరువులు, కుంటలు అభివృద్ధి పేరుతో నీటిని తోడేశారు. దీంతో చెరువులలో చుక్క నీరు కూడా లేదు.
- చెరువుల చుట్టుపక్కల ప్రాంతవాసులు దుర్గంధం భరించలేక దోమల బెడదతో అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- గత ఎన్నికల్లో ప్రజాప్రతినిధులు చెరువులను సుందరీకరించి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామన్న విషయం మళ్లీ ఎన్నికలు వచ్చినా తీర్చకపోవడం పై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

నోటు కాదు.. సేవా రాజకీయాలు రావాలి



ఉప్పల్‌లో అవయవ దానాలు చేస్తూ ప్రచారంలో బీఎస్పీ అభ్యర్థి సుంకరి నరేష్

ఉప్పల్: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదినం సందర్భంగా ఉప్పల్ బీఎస్పీ అభ్యర్థి సుంకరి నరేష్ తన ప్రత్యేకత చాటుకున్నారు. తన అవయవాలను దానం చేస్తానని జీవన్‌దాన్ కార్యాలయంలో హామీ పత్రంపై సంతకం చేసి అందజేశారు. ఆయనతో పాటు పార్టీ అభిమానులు సైతం పెద్దఎత్తున అవయవదానాలు చేయనున్నట్లు సంతకాలు చేసి అందజేశారు. మానవత్వం అంటే బతికున్నప్పుడు సేవ చేయడమే.. కాదు మనిషి చనిపోయిన తర్వాత కూడా మరొకరికి బతుకునిచ్చే గొప్ప కార్యక్రమం అవయవ దానం అన్నారు. అవయవ దానాలపై ప్రజల్లో ఇంకా సరిగ్గా అవగాహన లేనందున ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నరేష్ వెల్లడించారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

కాప్రా: ప్రభుత్వ, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములను ఆక్రమించాలని చూస్తే చట్ట రీత్యా కఠిన చర్యలు తప్పవని కాప్రా మండల తహసీల్దార్ ఎండీ మతిన్ హెచ్చరించారు. కాప్రాలోని సర్వే నంబర్ 151లో ప్రభుత్వ స్థలమని రెవెన్యూ అధికారులు గురువారం బోర్డును ఏర్పాటు చేశారు. 141, 151, 153లోని కస్టోడియన్ ల్యాండ్‌ను రాత్రి వేళల్లో చదును చేస్తూ కొందరు వ్యక్తులు ఆక్రమించేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు బుధవారం అడ్డుకున్నారు. కొందరు వ్యక్తులు ఆక్రమించాలని చూసిన వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించాలని చూస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని చట్టరీత్యా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



ప్రభుత్వ స్థలమని ఏర్పాటు చేసిన బోర్డు



ఆర్‌వో కార్యాలయంలో స్వతంత్ర అభ్యర్థి నిరసన



ఉప్పల్ ఆర్‌వో కార్యాలయంలో ఆడెపు గోవర్ధన్

ఉప్పల్: ఉప్పల్ రిటర్నింగ్ కార్యాలయంలో స్వతంత్ర అభ్యర్థి ఆడెపు గోవర్ధన్ అధికారుల తీరుపై నిరసనకు దిగారు. ఉప్పల్ కార్యాలయ ఎన్నికల అధికారులు తనను ప్రచారం చేయనీయకుండా వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తనకు ఎన్నికల నిబంధనలపై సరైన సమాచారం ఇవ్వకుండా మాట దాట వేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయ్యప్ప దీక్షలో ఉండి కూడా భిక్ష చేయకుండా సాయంత్రం వరకు అభ్యర్థి ఉప్పల్ రిటర్నింగ్ కార్యాలయంలో దీక్షను చేపట్టారు. ఎన్నికల నిబంధనలపై క్లారిటీ ఇచ్చే వరకు దీక్షను విరమించేది లేదని అన్నారు.

కొంత మంది 'నోటా' మాట!

దుండిగల్: మీ పార్టీ వోళ్లు మమ్మల్ని పిలుస్తలేరు.. ప్రచారంలో తిప్పతలేరు.. డబ్బులు ఇస్తలేరు.. ఎలక్షన్లలోపు ఓటుకు పైసలు ఇస్తనే మీ నాయకుడికి ఓటు వేస్తం.. ఇయ్యకపోతే వేరే పార్టీకి కూడా వేయ్యం.. సక్కగ పోయి నోటాకు గుద్దుతం.. అంటూ మాస్ పబ్లిక్ బహిరంగంగానే ద్వితీయ శ్రేణి నాయకులను హెచ్చరిస్తున్నారు. కొంత మంది నాయకులే తమ అధినాయకుడి నుంచి డబ్బులు తెచ్చుకుని కార్యకర్తలు, మహిళలకు ఇవ్వకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మురికివాడ ప్రాంతాల్లో ఇలాంటి విషయాలే వెలుగులోకి వస్తున్నాయి.

- దీంతో చేసేదేమి లేక చోటా.. మోటా నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ప్రతి రోజు ఒక్కో మహిళకు ప్రచారం కోసం రూ.500 ఆ పార్టీ నాయకులు చెల్లిస్తున్నారు. మురికివాడ ప్రాంతాల్లోని పలు బస్తీల్లోని మహిళలు, కార్యకర్తలు ఒకే నాయకుడిని నమ్ముకుని ఉంటున్నారు. అతనికి పార్టీ నుంచి సరైన గుర్తింపు, డబ్బు రావడం లేదు. దీంతో సదరు మహిళలు ఇతర పార్టీలకు వెళ్లి ప్రచారంలో పాల్గొనలేక.. ఇటు నమ్ముకున్న నాయకుడు తమకు గండి (రోజుకు రూ.500) కొడుతున్నాడని అన్నారు. ప్రతి రోజు అతని ఇంటికి వచ్చి శాపనార్థాలు పెడుతున్నారు. దీంతో చేసేదేమి లేక అతను మిన్నకుండి వారి తిట్ల దండకాన్ని ఆలకిస్తున్నాడు.

పార్టీల ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంల కమిషనింగ్

దుండిగల్: ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికలను పగడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు తెలిపారు. లయోల జూనియర్ కళాశాలలో ఈవీఎంల కమిషనింగ్‌ను ఆయా పార్టీల ఏజెంట్ల సమక్షంలో నిర్వహించారు. ర్యాండమైజేషన్ పద్ధతిలో ఆయా పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేసిన్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తీవ్రంగా గాయపడిన బాలుడు

జీడిమెట్ల: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున జరిగింది. ఇన్‌స్పెక్టర్ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. షాపూర్ నగర్‌కు చెందిన బలరాం కుమారుడు నవనాథ్(17), సంజయ్‌గాంధీ నగర్‌కు చెందిన రవి కుమారుడు తుషార్(18)లు ఇద్దరు స్నేహితులు. వీరిద్దరు 22వ తేదీన స్నేహితుడి పుట్టినరోజు ఉందని చెప్పి ఇంటి నుంచి వెళ్లారు. గురువారం ఉదయం 4గంటలకు తుషార్ ద్విచక్రవాహనం (టీఎస్13ఈజీ 0351) నడుపుతుండగా నవనాత్ వెనుక కూర్చున్నాడు. ఇద్దరు కలిసి షాపూర్‌నగర్ నుంచి అతివేగంగా బాలానగర్ వైపు వెళ్తున్నారు. వీరు చింతల్ రిడ్జ్ టవర్ వద్దకు చేరుకోగానే అక్కడే యూటర్న్ తీసుకుంటున్న కారు(టీఎస్28ఎన్0613)కు బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో తుషార్ తలకు తీవ్ర గాయాలు కావడంతో తుషార్ అక్కడికి అక్కడే మృతిచెందగా నవనాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే నవనాథ్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి తుషార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. నవనాథ్ తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ రాగానే.. ఇందిరమ్మ ఇళ్లు

మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేష్‌యాదవ్



సంస్కృతి టౌన్‌షిప్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు



రోడ్‌షోలో అభివాదం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేష్‌యాదవ్

మేడ్చల్ జోన్ బృందం: కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు కట్టించినట్లే.. పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చే పథకాన్ని ప్రారంభిస్తామని మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ పోచారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నారపల్లి, పోచారం, అన్నోజిగూడ, యమ్నంపేట్ తదితర ప్రాంతాల్లో గురువారం ఏర్పాటు చేసిన కార్నర్ సమావేశాల్లో రాష్ట్ర సీనియర్ నాయకుడు నక్కా ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ హయాంలో అమలు చేసిందని, దీన్ని 12 శాతానికి పెంచుతామన్న బీఆర్ఎస్ హామీ ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు, పదో తరగతి పాసైన బాలికలకు ఎలక్ట్రిక్ స్కూటీ, నిరుపేదలకు వైద్యం, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందుతుందన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లి ప్రాంత అధ్యక్ష, ఉపాధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్, ఎస్సీ, బీసీ, మైనార్టీ సెల్స్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యం..

కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సంస్కృతి టౌన్‌షిప్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు శ్రీగిరి వెంకట్ మాధవ్‌రెడ్డి తెలిపారు. గురువారం టౌన్‌షిప్‌లో ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతి బీఆర్ఎస్ పార్టీని సాగనంపాలన్నారు. కాంగ్రెస్ గెలుపుతో ప్రజలకు మేలు జరుగుతుందని వివరించారు. కీసర మండలంలో.. రాష్ట్రంలో మార్పుకోసం కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపించాలని నాగారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పట్టణ అధ్యక్షుడు ముప్ప శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ గెలుపును ఎవరూ ఆపలేరని, ప్రజలంతా కాంగ్రెస్‌కు ఓట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.